సాక్షి
పశ్చిమగోదావరి

మంగళవారం, 9, సెప్టెంబర్, 2025



ఉలిక్కిపడ్డ ట్రిపుల్ ఐటీ

సీనియర్ ప్రొఫెసర్‌పై ఎంటెక్ విద్యార్థి కత్తితో దాడి చేయడంతో నూజివీడు ట్రిపుల్ ఐటీలో కలకలం రేగింది. టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది ఆందోళనకు గురయ్యారు. 8లో



దళిత కుటుంబాలకు పరామర్శ

దానిగూడెం దళితులపై దాడి నేపథ్యంలో బాధిత కుటుంబాలను ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన దళిత యువకులు పరామర్శించారు. ఈ నేపథ్యంలో పోలీసులు భారీగా మోహరించారు. 8లో



ప్రమాదకరంగా గాలికుంటు

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో గాలికుంటు వ్యాధి పశువుల్లో సోకే అవకాశముందని, పాడి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. 8లో

న్యూస్‌రీల్

అర్జీలకు శాశ్వత పరిష్కారం : ఎస్పీ



అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ నయీం అస్మి

భీమవరం: ప్రజా ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహించకుండా నిర్ణీత గడువులోగా చట్ట పరిధిలో శాశ్వత పరిష్కారం చూపాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి జిల్లా పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం భీమవరం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన 13 మంది బాధితులు అర్జీలు అందజేశారు. అర్జీలను స్వీకరించిన అనంతరం సంబంధిత పోలీస్‌స్టేషన్ల అధికారులతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ప్రజా సమస్యలపై పూర్తిస్థాయి విచారణ జరిపి అర్జీలు తిరిగి పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ దేశంశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దొడ్డిపట్ల గోదావరిలో పంటు ప్రారంభం



యలమంచిలి మండలం దొడ్డిపట్ల వశిష్ట గోదావరి నదిలో రాకపోకలు సాగిస్తున్న పంటు

యలమంచిలి: మండలంలోని దొడ్డిపట్ల వద్ద వశిష్ట గోదావరి నదిలో పంటు ప్రయాణం పునః ప్రారంభమైంది. గత నెల 29న గోదావరిలో వరద నీరు పెరిగి కనకాయలంక కాజ్‌వే మునిగిపోవడంతో అధికారుల ఆదేశాల మేరకు దొడ్డిపట్ల రేవులో పంటు ప్రయాణాన్ని నిలిపివేశారు. 11 రోజుల తరువాత వరద తగ్గి కనకాయలంక కాజ్‌వే వరద నుంచి పూర్తిగా బయటపడడంతో సోమవారం నుంచి పంటు ప్రయాణం ప్రారంభించారు. దీంతో ఉభయ గోదావరి జిల్లాల్లోని డెల్టా, కోనసీమ ప్రజలకు ప్రయాణం సులభతరమైంది.

కలెక్టరేట్ కోసం 3 రోజుల నిరాహార దీక్ష

భీమవరం (ప్రకాశం చౌక్) : భీమవరం మార్కెట్ యార్డులోనే కలెక్టరేట్ నిర్మించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల తొమ్మిదో తేదీ మంగళవారం నుంచి మూడు రోజులపాటు భీమవరం ప్రకాశం చౌక్ సెంటర్‌లో రిలే నిరాహార దీక్ష చేపట్టనున్నట్టు ప్రముఖ న్యాయవాది, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ జవ్వాది సత్యనారాయణ (సత్తిబాబు) తెలిపారు. పార్టీలకు అతీతంగా భీమవరం పౌరులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన కోరారు.

కొనసాగుతున్న యూరియా కష్టాలు



కృష్ణారావుపేట సొసైటీ వద్ద యూరియా కోసం క్యూ కట్టిన రైతులు

పోలవరం రూరల్: యూరియా కొరత లేదంటూ ప్రభుత్వం చెప్పే లెక్కలకు, క్షేత్రస్థాయిలో పరిస్థితులకు పొంతన లేని పరిస్థితి కనిపిస్తోంది. పోలవరం మండలంలోని కృష్ణారావుపేట, పట్టిసీమ, గూటాల, ప్రగడపల్లి సొసైటీల్లో 50.460 మెట్రిక్ టన్నుల యూరియా ఉన్నట్టు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. సోమవారం ఉదయం పట్టిసీమ, పోలవరం సొసైటీల వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరారు. ఆధార్ కార్డులు పట్టుకుని క్యూ కట్టారు. రైతుకు రెండు బస్తాలు యూరియా వంతున పంపిణీ చేపట్టారు. కొన్ని గంటల్లోనే ఉన్న సరకు అయిపోయింది. దీనిపై రైతులు సిబ్బందిని నిలదీయగా, వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో పోలవరం ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ అక్కడికి చేరుకొని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. క్యూలో ఉన్నవారికి మాత్రమే బస్తాలు ఇవ్వడంతో ఆ తర్వాత వచ్చినవారు మిగిలిపోయారు. మిగిలిన రైతులు సుమారు 150 మంది వరకు ఉండటంతో వారికి వచ్చే కోటాలో యూరియా ఇస్తామని నచ్చజెప్పారు. వారికి స్లిప్పులు ఇచ్చి యూరియా వచ్చిన వెంటనే ముందుగా ఇచ్చేందుకు ఏర్పాటు చేయడంతో రైతులు శాంతించి వెనుదిరిగారు. యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనడానికి ఇదో తాజా ఉదాహరణ.



అన్నదాతకు అండగా..

యలమంచిలి మండలంలో మొత్తం 9 సొసైటీలకు గాను కొంతేరు, యలమంచిలి, శిరగాలపల్లి, నారినమెరక, చించినాడ సొసైటీల్లో ఎరువుల విక్రయం చేస్తున్నారు. **ఈ సీజన్‌లో యలమంచిలి సొసైటీకి 50 టన్నులు, కొంతే**రుకు 36, శిరగాలపల్లికి 80, **నారినమెరకకు 36, చించినాడకు 36 టన్నులు వచ్చింది. అరకొర** నిల్వలతో స్టాకు వచ్చిన వెంటనే **రైతులు ఎగరేసుకుపోతున్నారు. ఒక్కోసారి ఎకరాకు అర** బస్తా (22.5 కిలోలు) మాత్రమే ఇస్తున్నట్టుగా రైతులు చెబుతున్నారు. కొంతేరు సొసైటీకి 12.5 టన్నుల వరకు రాగా సోమవారం రైతులు ఎగబడిమరీ తీసుకువెళ్లారు.

పెనుమంట్రలోని డీసీఎంఎస్ గోడౌన్‌కు జూన్ 20న 25.200 టన్నులు, జూలై 23న 25.200 టన్నులు, జూలై 31న 6.300 టన్నుల యూరియా వచ్చింది. వచ్చిన రెండు మూడు రోజుల్లోనే ఈ స్టాకు అయిపోయింది. ఆగస్టు, సెప్టెంబరులో ఇప్పటి వరకు స్టాకు రాలేదని సిబ్బంది చెబుతున్నారు. ఈ–పోస్ యంత్రంలో స్టాకు ఉన్నట్టుగా చూపిస్తున్నట్టు సమాచారం. ప్రస్తుతం ప్రైవేట్ డీలర్ల వద్ద కూడా దొరకడం లేదని ఇక్కడి రైతులు అంటున్నారు.

- ఎరువుల కొరత లేదంటున్న అధికారులు
- యూరియా దొరకడం లేదంటున్న రైతులు
- సొసైటీలు, డీలర్ల చుట్టూ ప్రదక్షిణలు
- రైతుల పక్షాన నేడు వైఎస్సార్‌సీపీ పోరు
- ఆర్డీఓ కార్యాలయాల వద్ద రైతులతో కలసి కార్యక్రమం



పెనుమంట్రలో యూరియా స్టాకు లేని డీసీఎంఎస్ గొడౌన్

సాక్షి, భీమవరం: జిల్లాలో 2.15 లక్షల ఎకరాల్లో వరి, 25 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం ఖరీఫ్ సీజన్‌కు 21,270 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమవుతుంది. ఇప్పటివరకు 20,310 మెట్రిక్ టన్నులు రాగా 18,329 మెట్రిక్ టన్నులు రైతులకు అందజేసినట్టు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఎరువుల కొరత లేదని, సొసైటీల్లో అవసరమైన యూరియా నిల్వలు ఉన్నాయని.. అధికారులు చేస్తున్న ప్రకటనలకు, క్షేత్రస్థాయిలో పరిస్థితికి పొంతన ఉండటం లేదు. కొన్ని సొసైటీల్లో స్టాకు లేదని సిబ్బంది రైతులను వెనక్కి పంపిస్తున్నారు.

వినియోగం తక్కువే

రబీతో పోలిస్తే ఖరీఫ్‌లో యూరియా వినియోగం తక్కువగా ఉంటుంది. దాళ్వాలో మూడు నుంచి నాలుగు బస్తాలు (ఒక్కో బస్తా 45 కిలోలు) వినియోగిస్తే తొలకరిలో రెండు దఫాలుగా రెండు బస్తాల వరకు మాత్రమే వేస్తుంటారు. ముందుగా నాట్లు జరిగిన తాడేపల్లిగూడెం, తణుకు, ఉండి, భీమవరం నియోజకవర్గాల్లో దాదాపు రెండు కోటాలు పూర్తయ్యాయి. నీటి ఎద్దడి, వర్షాభావ పరిస్థితులతో సాగు ఆలస్యమైన ఆచంట, పాలకొల్లు, నరసాపురం నియోజకవర్గాల్లో చాలాచోట్ల మొదటి కోటా మాత్రమే వేశారు. కొన్ని సొసైటీల్లో యూరియా లభ్యత లేక రైతులు ఇబ్బంది పడుతున్న పరిస్థితులు ఉన్నాయి. యలమంచిలి మండలంలో కొన్నిచోట్ల అర బస్తా మాత్రమే ఇస్తుండగా, పెనుగొండ, ఆచంట మండలాల్లో యూరియాకు కాంప్లెక్స్ ఎరువుల లింక్ పెడుతున్నట్టు రైతులు చెబుతున్నారు.

నేడు అన్నదాత పోరు

రైతు సంక్షేమాన్ని గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ మంగళవారం రైతులతో కలిసి వైఎస్సార్‌సీపీ అన్నదాత పోరు నిర్వహించనుంది. రెవెన్యూ డివిజన్ పరిధిలోని పార్టీ శ్రేణులు, రైతులు ఆర్డీఓ కార్యాలయాలకు చేరుకుని వినతిపత్రాలు అందజేస్తారు. భీమవరం, ఉండి నియోజకవర్గాల నుంచి భీమవరం ఆర్డీఓ కార్యాలయం, తణుకు, తాడేపల్లిగూడెం నుంచి తాడేపల్లిగూడెంలోను, నరసాపురం, ఆచంట, పాలకొల్లు నుంచి నరసాపురంలోను రైతు సమస్యలపై వినతులు ఇస్తారు.

వైఎస్సార్‌సీపీ పిలుపుతో ఉలికిపాటు

యూరియా కొరత, రైతుల సమస్యల పరిష్కారంలో అలసత్వంపై వైఎస్సార్‌సీపీ ఈ నెల తొమ్మిదో తేదీన అన్నదాత పోరుకు పిలుపునివ్వడం కూటమి ప్రభుత్వానికి మింగుడుపడటం లేదు. సాగుకు ముందే నిల్వలు పక్కదారి పట్టడం ప్రస్తుత దుస్థితికి కారణమని వైఎస్సార్‌సీపీ నేతలు విమర్శిస్తున్నారు. డెల్టా జిల్లాలో యూరియాకు కొరత రావడం ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనమంటూ మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఎరువుల గోడౌన్లు, దుకాణాలపై విజిలెన్స్ తనిఖీలు, కేసుల నమోదు పేరిట ప్రభుత్వం హడావిడి చేస్తోంది. జిల్లాలో 13 (6ఏ) కేసులు నమోదు చేసి రూ.16.86 లక్షల విలువైన 76.65 మెట్రిక్ టన్నుల యూరియాను సీజ్ చేసినట్టు అధికారులు చెబుతున్నారు.

స్టాక్ లేదంటున్నారు



నాలుగు ఎకరాలు సాగు చేస్తున్నాను. ఈ సీజన్‌లో యూరియా దొరకడం చాలా కష్టంగా ఉంది. సొసైటీలు, బయటి దుకాణాల్లో ఎక్కడా స్టాకు లేదంటున్నారు. గతంలో ఎప్పుడూ ఇంత ఇబ్బంది రాలేదు. ఈ తొలకరికే యూరియాకు కొరత వచ్చింది.

– గణపాబత్తుల ఏసుబాబు, గుంపర్రు, యలమంచిలి మండలం

యూరియా దొరకడం లేదు



యూరియా మొదటి కోటాకు ఇబ్బంది రాలేదు. ఇప్పుడు రెండో కోటా వేద్దామంటే ఎక్కడా దొరకడం లేదు. ఎరువుల దుకాణంలో ఖాతా ఉంది. అక్కడ లేకపోవడంతో డీలర్ సూచనపై పెనుమంట్ర డీసీఎంఎస్‌కు వస్తే ఇక్కడ స్టాకు లేదని చెప్పారు.

– పి.రాము, రైతు, మాముడూరు, పెనుమంట్ర మండలం

గ్యాంబ్లింగ్ హబ్‌గా 'గూడెం'

మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆగ్రహం



మాట్లాడుతున్న మాజీమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : కూటమి ప్రభుత్వ హయాంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గాన్ని గ్యాంబ్లింగ్ హబ్‌గా మార్చేశారని మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ విమర్శించారు. ఏ వీధిలో చూసినా బెల్టు దుకాణాలు, ఎక్కడ చూసినా జూదం, కోడి పందేలు, పేకాట.. ఇక గూడెంను ఏం చేద్దామనుకుంటున్నారు.. అంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రజాప్రతినిధికి చెందినవారు వేసిన ఇసుక కొండల నుంచే అధిక ధరకు ఇసుక కొనుగోళ్లు చేయాలంటూ లారీ డ్రైవర్లపై బెదిరింపులకు పాల్పడతున్నారని విమర్శించారు. షాడోలు, షాడోల వారసుల ముసుగులో నియోజకవర్గంలో అక్రమ దందాలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ అనుమతులతో మట్టి తవ్వకాలు చేస్తున్నవారిని సైతం బెదిరించి.. ఇక్కడి నేతల అనుమతి తీసుకోవాల్సిందే అంటూ వసూళ్లకు పాల్పడుతున్నారని విమర్శించారు.

రైతుల సమస్యలపై చిత్తశుద్ధి ఏదీ?

డెల్టా ప్రాంతంలో అకాల వర్షాలకు పంటలు మునిగిపోతే ఆయా రైతుల గురించి పట్టించుకున్న పరిస్థితి లేదని కొట్టు సత్యనారాయణ విమర్శించారు. కాలువల్లో పూడుకుపోయిన తూడును తొలగించారా అని ప్రశ్నించారు. పంట మునిగిన రైతులకు కాకుండా ఎగువ ప్రాంత రైతులకు పరిహారం అందిస్తారా అంటూ నిలదీశారు. యూరియా కొరత వస్తుందని ముందే గమనించి.. స్థానిక కూటమి నేతలు భారీస్థాయిలో గోదాముల్లో యూరియా నిల్వ చేశారని ఆయన విమర్శించారు. వాటిపై తనిఖీల కోసం విజిలెన్స్ సీఐ నేతృత్వంలో వచ్చిన బృందాన్ని తనిఖీలు చేయనివ్వకుండా ఎవరు ప్రభావితం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. పడమరవిప్పర్రు గ్రామంలో యూరియా బస్తా రూ.400కు మించి అమ్ముతుంటే వ్యవసాయాధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. మద్యం బాటిల్‌కు ఎంఆర్‌పీ కంటే అధికంగా పది రూపాయలు, దాబాలలో అదనంగా 40 రూపాయలు వసూలు చేస్తూ విక్రయాలు చేస్తుంటే ఎక్సైజ్ అధికారులు ఏం చేస్తున్నారని నిలదీశారు. వేరే పార్టీల వారు అధికార పార్టీలో చేరితే విచ్చలవిడిగా జూదం ఆడించుకోవచ్చా అని ప్రశ్నించారు. పెద్ద ఎత్తున కోడి పందేలు జరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని నిలదీశారు. కాకినాడ బియ్యం అక్రమ రవాణాలో తాడేపల్లిగూడెం క్రియాశీలకంగా ఉందంటున్నారని, దీనికి సూత్రధారులు ఎవరని ప్రశ్నించారు. రాష్ట్ర మీడియాలో సైతం ఇక్కడి అక్రమాలను ప్రత్యేక కథనాలతో వెలికితీస్తోందని, వీటిపై జిల్లా పర్యవేక్షణాధికారిగా ఉన్న కలెక్టర్ పట్టించుకోకపోతే ఎలా అని ప్రశ్నించారు.

బియ్యం అక్రమ రవాణాలో గూడెం క్రియాశీలకం

తాము అధికారంలో ఉండగా, శాంతిభద్రతలను అదుపులో ఉంచి, మహిళలకు రక్షణ కల్పించలేదా అన్నారు. ట్రాఫిక్ పద్మవ్యూహ సమస్య పరిష్కారానికి రెండో ఫ్లైవోవర్ వంతెనను చేతిలో ఫైల్స్ పట్టుకొని సెక్రటేరియట్, మంత్రుల చుట్టూ తిరిగి నిర్మిస్తే, ఏదో బిల్డింగ్ కట్టుకున్నానని మాట్లాడుతున్నారు. ఇటీవల ఈ ప్రభుత్వం మూడు వంతెనలను 200కోట్లతో నిర్మిస్తున్నామంటున్నారు. వారు ఏం చేస్తారో. నెత్తిమీద పదిరూపాయలు పెడితే పది పైసలకు పలుకని నాయకులతో నకిలీ ప్రెస్‌మీట్లు పెడుతుంటారు. ఏంటి ఈ విధానం అన్నారు. కాకినాడ బియ్యం అక్రమ రవాణాలో గూడెం క్రియాశీలకంగా ఉందంటున్నారు. ఎవ్వరు దీనికి సూత్రధారులన్నారు. రాష్ట్ర మీడియా ఇక్కడి విషయాలపై ప్రత్యేక కథనాలను ప్రచురిస్తున్నాయి. జిల్లా పర్యవేక్షణాధికారిగా ఉన్న కలెక్టర్ ఇలాంటి విషయాలను పట్టించుకోవాలి కదా అన్నారు. నియోజకవర్గంలో రౌడీయిజం, నాన్ లేఅవుట్ల దందా పెరిగిపోయిందన్నారు. అధికారం చేతిలో ఉందని అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారని, ప్రజలు వాస్తవాలను గుర్తించి కూటమి నేతలను తిరస్కరించడానికి ఎంతో కాలం పట్టదన్న విషయాలను గమనించాలని హెచ్చరించారు. రైతులకు ఏ కష్టం వచ్చినా వారికి అండగా ఉండటానికి వైఎస్సార్‌సీపీ ముందు వరుసలో ఉంటుందన్నారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం మంగళవారం చేపట్టిన కార్యక్రమం విజయవంతం చేయాలని, పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు, రైతులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

స్కూటీతో నేరుగా ఆస్పత్రి వార్డుల్లోకి..

- ఇష్టానుసారంగా కాంట్రాక్టర్ తీరు
- వైద్యాధికారులు చెప్పినా డోంట్ కేర్



ప్రభుత్వ ఆసుపత్రి వార్డులో ద్విచక్ర వాహనంపై ఆహారం సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్ (ఫైల్)



ఆసుపత్రిలో నర్సింగ్ వార్డు వద్ద పార్క్ చేసిన ఆహారంతో ఉన్న వాహనం

పాలకొల్లు సెంట్రల్ : ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అందించే ఆహారాన్ని కాంట్రాక్టర్ నేరుగా తన ద్విచక్ర వాహనంతో వార్డుల్లోకి తీసుకువెళ్లి అందించడంపై రోగులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అక్కడున్న ఒక వ్యక్తి ఫొటో తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో ఈ విషయం బహిర్గతమైంది. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి వేళల్లో భోజనం కాంట్రాక్టర్ ద్వారా ఏర్పాటు చేస్తుంటారు. ఈ కాంట్రాక్టర్ గత కొంతకాలంగా ఆహారాన్ని నేరుగా వార్డుల్లోకి తన ద్విచక్ర వాహనంతో వెళ్లి సరఫరా చేస్తుండటం గమనార్హం. ఆస్పత్రి వైద్యాధికారులు ద్విచక్ర వాహనంతో లోపలికి రావద్దని వారించినా, తాను గత కొంత కాలంగా ఇలానే ఇస్తున్నానంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పినట్టు సమాచారం. సోషల్‌మీడియాలో ఈ విషయం వైరల్ కావడంతో ద్విచక్ర వాహనాన్ని వార్డు వద్ద పెట్టి.. లోపలికి పేషెంట్లను తీసుకెళ్లే వీల్ చైర్‌లో పెట్టుకుని తీసుకెళ్లడం గమనార్హం. మరి అత్యవసర సమయంలో వీల్ చైర్ అవసరమైతే ఏం చేస్తారని ఆసుపత్రికి వచ్చిన రోగుల బంధువులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

శ్రీవారి ఆలయంలో దొడ్డిదారిన గదులు అద్దెకు

ద్వారకాతిరుమల: దొడ్డిదారిన గదులు అద్దెకిచ్చి, ఆలయ సొమ్ము స్వాహా చేసిన ఇద్దరు ఉద్యోగులపై అధికారులు చర్యలు తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. గుంటూరుకు చెందిన భక్తులు సోమవారం ఉదయం శ్రీవారి దర్శనార్థం టూరిస్టు బస్సులో కొండపైకి వచ్చారు. స్నానాదుల కోసం రూములు తీసుకునేందుకు సీఆర్వో కార్యాలయానికి వెళ్లి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి వంశీని వివరాలు అడిగారు. ధర్మ అప్పారాయ నిలయానికి వెళ్లి రూములు చూసుకోవాలని అతను సలహా ఇచ్చాడు. దీంతో వారు అక్కడికి చేరుకొని గుమాస్తాగా విధులు నిర్వర్తిస్తున్న శాశ్వత ఉద్యోగి సీహెచ్ పవన్‌కుమార్‌ను గదులు అద్దెకు కావాలని అడిగారు. అతను రూ.4500 నగదు తీసుకొని టికెట్లు లేకుండా 7 నాన్ ఏసీ గదులను అద్దెకు ఇచ్చాడు. దీనిపై సమాచారం అందుకున్న ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యనారాయణ మూర్తి అధికారులతో తనిఖీ చేయించగా, నిజమని తేలింది. ఉద్యోగులిద్దరూ కుమ్మక్కై ఇదంతా చేశారని అధికారులు తేల్చడంతో పవన్ కుమార్‌ను సస్పెండ్ చేస్తూ ఈఓ ఉత్తర్వులు జారీ చేశారు. వంశీని విధుల నుంచి తొలగించారు. స్వాహా అయిన సొమ్మును వసూలు చేసి గదులకు అద్దె చెల్లించారు.

ఎన్నికల హామీ అమలు చేయాలి

పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు వైఎస్సార్‌సీపీ మైనారిటీ సెల్ వినతి



కలెక్టర్ నాగరాణికి వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ మైనారిటీ సెల్ సభ్యులు

భీమవరం (ప్రకాశంచౌక్): ఇమామ్‌లకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం రూ.10 వేలు, రూ.5 వేల గౌరవ వేతనం అమలు చేయాలని వైఎస్సార్‌సీపీ మైనారిటీ సెల్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సోమవారం భీమవరంలోని జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్ అర్జీల స్వీకరణ కార్యక్రమంలో వారు కలెక్టర్ చదలవాడ నాగరాణిని కలిసి ఈ మేరకు అర్జీని అందించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ జహంగీర్ మాట్లాడుతూ ఇమామ్‌లు, మౌజన్లకు పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఆటో డ్రైవర్లకు న్యాయం చేయాలి

కూటమి ప్రభుత్వం తీసుకున్న ఉచిత బస్సు నిర్ణయం వల్ల ఆటో డ్రైవర్ల కుటుంబాల ఆర్థిక పరిస్థితి దారుణంగా తయారైందంటూ ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఇంటి సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. ఆటో డ్రైవర్లకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా కోరారు.



కలెక్టర్ నాగరాణికి వినతిపత్రం ఇస్తున్న ఆటో డ్రైవర్లు

ప్రజల నుంచి 192 అర్జీలు

జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్‌తో పాటు అధికారులు ఫిర్యాదులను స్వీకరించారు. వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజల నుంచి 192 అర్జీలు అందాయి. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో బి.శివన్నారాయణ రెడ్డి, డ్వామా పీడీ డాక్టర్ కేసీహెచ్ అప్పారావు, గ్రామ వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి తదితరులు వాటిని స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి నిర్ణీత గడువులోపుగా వారి సమస్యలకు పరిష్కారం చూపాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఉత్పన్నమయ్యే సమస్యలకు అక్కడే మంచి పరిష్కార మార్గాలు చూపించాలని, అర్జీలు రీఓపెన్ ఆస్కారం లేకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, వయోవృద్ధుల సంక్షేమ ట్రిబ్యునల్ సభ్యుడు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ పింఛన్ అందడం లేదు..

కలెక్టర్‌కు విన్నవించిన దివ్యాంగుడి కుటుంబసభ్యులు



దివ్యాంగుడి సమస్యను తెలుసుకుంటున్న కలెక్టర్ నాగరాణి

కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ అర్జీల స్వీకరణ కార్యక్రమ ప్రాంగణం వద్ద వీల్‌చైర్‌లో మెలికలు తిరిగిపోతున్న దివ్యాంగుడిని చూసి కలెక్టర్ నాగరాణి చలించిపోయారు. అతని వద్దకు వచ్చి ఏమైందంటూ అతని తల్లిదండ్రులను ఆరా తీశారు. తమ కుమారుడి పేరు బొడ్డు రాఘవేంద్ర అని, చిన్ననాటి నుంచీ ఇదే పరిస్థితని ఈ సందర్భంగా వారు కలెక్టర్‌కు వివరించారు. వీల్‌చైర్‌లో కూడా నిలకడగా కూర్చోబెట్టలేని పరిస్థితని తెలిపారు. దివ్యాంగుల పింఛన్ ప్రస్తుతం రూ.6 వేలు అందుతోందని, సదరం సర్టిఫికెట్‌లో అంగవైకల్యం 45 శాతం మాత్రమే నమోదవడంతో మెడికల్ పింఛన్ అందుకోలేకపోతున్నామని వివరించారు. తమ కుమారుడిని చూసుకోవడం చాలా కష్టంగా ఉందని, ఎప్పుడూ ఇద్దరు వ్యక్తులు పనులు మానుకుని దగ్గరుండి చూసుకోవాల్సిన పరిస్థితని వారు వాపోయారు. దీంతో కలెక్టర్ స్పందిస్తూ డీసీహెచ్ఎస్‌ని పిలిచి కొత్తగా సదరం సర్టిఫికెట్ మంజూరుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీనిని ప్రత్యేక కేసుగా ప్రభుత్వానికి సిఫార్సు చేస్తూ పంపడానికి ప్రతిపాదన సిద్ధం చేయాలని చెప్పారు. అధైర్యపడొద్దని అతని తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు.

మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల పునర్నిర్మాణానికి చర్యలు

జిల్లాలోని మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల పునర్నిర్మాణానికి వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ చాంబర్‌లో ఆమె డ్వామా, ఇరిగేషన్, గ్రౌండ్ వాటర్, ఆర్ డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ అధికారులతో మాట్లాడుతూ తాడేపల్లిగూడెం మెట్ట ప్రాంతంలో గుర్తించిన 54 మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల పునర్నిర్మాణం చేసి భూగర్భ జలాల పెంపునకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ పనులను ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టేందుకు అంచనాలు సిద్ధం చేయాలన్నారు. వీటిలో డీసిల్టింగ్, గట్ల పటిష్టత, స్లూయిస్, షటర్లు, జంగిల్ క్లియరెన్స్ తదితర పనులు చేపట్టేందుకు అంచనాలు సిద్ధం చేసి డ్వామా పీడీకి అందించాలన్నారు. డ్వామా పీడీ డాక్టర్ కేసీహెచ్ అప్పారావు, ఏపీడీ జీవీకే మల్లికార్జునరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తగ్గుతున్న గోదావరి వరద

పోలవరం రూరల్: గోదావరి వరద రోజు రోజుకు తగ్గుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి నదిలోకి చేరే నీరు క్రమేపీ తగ్గుతుండటంతో వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద 29.950 మీటర్లకు నీటిమట్టం చేరుకుంది. స్పిల్‌వే నుంచి 4.75లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు చేరుతోంది. ఎగువన భద్రాచలం వద్ద 26.10 అడుగులకు నీటిమట్టం చేరుకుంది.

పశ్చిమగోదావరి బీసీ కమిటీ ఇన్‌చార్జిగా రంగారావు


చెన్ను రంగారావు

నాగాయలంక: కృష్ణా జిల్లా నాగాయలంక మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ విభాగం జాయింట్ సెక్రటరీ చెన్ను రంగారావును పశ్చిమ గోదావరి జిల్లా బీసీ కమిటీ ఇన్‌చార్జిగా నియమించారు. ఈ విషయాన్ని సోమవారం ఆయన తెలిపారు. వైఎస్సార్ సీపీ పశ్చిమ గోదావరి జిల్లా బీసీ కమిటీ ఇన్‌చార్జి బాధ్యతలను తనకు అప్పగించినందుకు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు రాజగొల్ల రమేష్‌యాదవ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నలుగురు నిందితుల అరెస్టు

ఉండి: గత నెల 31న ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సును అడ్డగించి క్లీనర్‌ను కొట్టిన కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్సై ఎండీ నసీరుల్లా తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం 31న రాత్రి ఉండి మండలం గోరింతోట వద్ద ఐదుగురు వ్యక్తులు ప్రైవేటు ట్రావెల్స్ బస్సును అడ్డగించి దాని క్లీనర్‌ను కొట్టి రూ.వెయ్యి నగదు, సెల్‌ఫోన్ దోచుకున్నారు. దీనిపై క్లీనర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా ఆకివీడు రూరల్ సీఐ జగదీశ్వరరావు, ఎస్సై ఆధ్వర్యంలో సోమవారం దాసి విజయ్, నేతల అజయ్‌బాబు, పోతురాజు ఆనంద్, మరో మైనర్ బాలుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

ఎరువుల షాపుల్లో తనిఖీలు

కామవరపుకోట: మండలంలోని వివిధ ప్రాంతాలలో ఏక కాలంలో రెండు బృందాలుగా ఎరువులు షాపులపై ఆకస్మిక తనిఖీ చేసినట్లు విజిలెన్స్ డీఎస్పీ సింగలూరి వెంకటేశ్వరరావు తెలిపారు. రెండు షాపుల్లో ఓ-ఫారం లేనందున 41.700 టన్నుల ఎరువులు అమ్మకాలు నిలుపుదల చేసినట్లు తెలిపారు.

ఉలిక్కిపడ్డ ట్రిపుల్ ఐటీ

- ప్రొఫెసర్‌పై దాడితో అప్రమత్తం
- ఆందోళనలో ఫ్యాకల్టీ, నాన్‌టీచింగ్ సిబ్బంది


నూజివీడు ట్రిపుల్‌ఐటీలోని అకడమిక్ భవనం

నూజివీడు: ట్రిపుల్ ఐటీలో పనిచేస్తున్న సీనియర్ ప్రొఫెసర్‌పై ఎంటెక్ విద్యార్థి కత్తితో దాడి చేయడంతో ట్రిపుల్ ఐటీ ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఇక్కడ పనిచేస్తున్న మెంటార్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్లు, గెస్ట్ ఫ్యాకల్టీ, నాన్ టీచింగ్ సిబ్బంది అందరూ దాడి సంఘటనతో ఆందోళనకు గురయ్యారు. ఆర్జీయూకేటీకి గతంలో రిజిస్ట్రార్‌గా, నూజివీడు ట్రిపుల్ ఐటీకి డైరెక్టర్‌గా, ఏఓగా, అడ్మిషన్ల కన్వీనర్‌గా పనిచేసిన సివిల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ ఎస్ఎస్ఎస్‌వీ గోపాలరాజుపై ఎంటెక్ ప్రథమ సంవత్సరం విద్యార్థి వినయ్ పురుషోత్తం కత్తితో దాడి చేయడాన్ని ఫ్యాకల్టీ, నాన్ టీచింగ్ స్టాఫ్, మెంటార్ల యూనియన్‌లు ముక్తకంఠంతో తీవ్రంగా ఖండించాయి. ఒక విద్యార్థి జేబులో రెండు కత్తులు పెట్టుకొని తరగతి గదికి రావడంపై ఆందోళన వ్యక్తం చేశాయి. ఇలా అయితే తమకు రక్షణ ఏముంటుందని ఫ్యాకల్టీ ముక్తకంఠంతో ప్రశ్నిస్తోంది. 9,900 మంది విద్యార్థులున్న నూజివీడు ట్రిపుల్ ఐటీలో మున్ముందు తమ పరిస్థితి దారుణంగా ఉంటుందేమోననే ఆందోళన వ్యక్తం చేస్తోంది. దాడి జరిగింది తరగతి గదిలో కాబట్టి మిగిలిన విద్యార్థులందరూ వచ్చి నిలువరించారని, ఇదే సంఘటన ప్రొఫెసర్ కేబిన్‌లో జరిగి ఉంటే దాడి నుంచి ప్రొఫెసర్‌ను ఎవరు కాపాడేవారని ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఫ్యాకల్టీకి భద్రత డొల్లేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తరగతులకు హాజరుకాకుంటే ఏం చేస్తున్నారు?

ప్రొఫెసర్‌పై దాడికి పాల్పడిన ఎంటెక్ ప్రథమ సంవత్సరం విద్యార్థి వినయ్ పురుషోత్తం ప్రారంభం నుంచి తరగతులకు, ల్యాబ్‌లకు గానీ హాజరయ్యేవాడు కాదని ట్రిపుల్ ఐటీ వర్గాలు పేర్కొంటున్నాయి. రెసిడెన్షియల్ విధానంలో నిర్వహిస్తున్న ట్రిపుల్ ఐటీలో తరగతులకు రాకుండా హాస్టల్ గదిలోనే ఉంటున్నప్పుడు పరిపాలన చేసే అధికారులు ఏం చేస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. హెచ్ఓడీ, డీన్ అకడమిక్స్, డైరెక్టర్‌లు నిత్యం గైర్హాజరవుతున్న విద్యార్థులను గుర్తించి ఎందుకు గైర్హాజరవుతున్నారో తెలుసుకొని ఆ విద్యార్థి తల్లిదండ్రులకు తెలియజేయాల్సి ఉన్నప్పటికీ అలా చేసిన దాఖలాలు లేవు. ఈ విద్యార్థి తన రూమ్‌లో ఉండే మరికొందరు విద్యార్థులతో కూడా మాట్లాడకుండా ఉంటాడని పలువురు పేర్కొంటున్నారు. హాస్టల్‌లో ఉండే విద్యార్థులు సహజంగా పండ్లు కోసుకోవడానికి ఇంటి వద్ద నుంచే చాకులు తెచ్చుకుంటారు. అయితే ఇతను రెండు చాకులను జేబులో పెట్టుకొని తరగతి గదికి రావడాన్ని బట్టి చూస్తుంటే దాడి చేయాలనే లక్ష్యంతోనే ఉద్దేశపూర్వకంగా తెచ్చుకున్నట్లుగా ఉందని అధ్యాపకులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా యాజమాన్యం కఠినంగా వ్యవహరించాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

10న క్వాంటం వ్యాలీ హ్యాకథాన్ సెమీస్


భీమవరంలోని ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో వివరాలు వెల్లడిస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం పట్టణంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో అమరావతి క్వాంటం వ్యాలీ హ్యాకథాన్ సెమీఫైనల్స్ ఈ నెల 10న జరుగుతాయని కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు సోమవారం తెలిపారు. ప్రిన్సిపల్ కేవీ మురళీకృష్ణంరాజు, టెక్నాలజీ సెంటర్ హెడ్ ఎన్.గోపాలకృష్ణమూర్తితో కలసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయం వెల్లడించారు. ఈ పోటీలకు ఉభయ గోదావరి జిల్లాల్లోని 20 ఇంజనీరింగ్ కళాశాలల నుంచి 40 బృందాలకు సంబంధించి 240 మంది విద్యార్థులు హాజరవుతున్నట్టు చెప్పారు. బుధవారం ఉదయం 8:30 గంటలకు కళాశాల ఓపెన్ ఆడిటోరియంలో జరిగే ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జేఎన్టీయూ కాకినాడ వైస్ చాన్సలర్ సీఎస్ఆర్‌కె ప్రసాద్ హాజరవుతారని న్యాయ నిర్ణేతగా ఉన్నత విద్యా మండలి మాజీ వైస్ చైర్మన్, ఆంధ్ర యూనివర్సిటీ సీఎస్ఎస్ఈ విభాగం ప్రొఫెసర్ వి.వల్లి కుమారి వ్యవహరిస్తున్నారన్నారు.

దళిత కుటుంబాలకు పరామర్శ

క్రైకలూరులో 144 సెక్షన్, భారీగా పోలీసుల మోహరింపు


దానిగూడెంలో పోలీసులతో మాట్లాడుతున్న దళిత మహాసభ అధ్యక్షుడు చింతపల్లి గురుప్రసాద్

కైకలూరు: దానిగూడెం దళితులపై దాడి నేపథ్యంలో కైకలూరు పట్టణంలో నాలుగు రోజులుగా పోలీసులను మోహరించారు. నిందితులను రిమాండ్‌కు తరలించినప్పటికీ ప్రధాన సూత్రదారుడిని అదుపులోకి తీసుకోవాలంటూ దళిత నాయకులు డిమాండ్ చేస్తున్నారు. సోమవారం నియోజకవర్గం, ఇతర ప్రాంతాల నుంచి దాదాపు 150 మంది దళిత యువకులు పోలీసుల వలయాన్ని చేధించుకుని దానిగూడెం చేరుకున్నారు. దానిగూడెం ప్రజలు వంటా, వార్పుతో మద్దతు తెలపడానికి వచ్చిన వారికి భోజనాలు అందించారు. డీఎస్పీ, పలువురు సీఐలు, ఎస్ఐలు కలిపి దాదాపు 200 మంది పోలీసులు విధులు నిర్వహించారు. రాష్ట్రంలో అభివృద్ధి లేదు.. సంక్షేమం లేదు.. రోజు రోజుకు దళితులు, బీసీలు, ఎస్టీలు, మైనార్టీ కులాలపై అత్యాచారాలు, హత్యలు, అరాచకాలు జరుగుతున్నాయని ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షులు చింతపల్లి గురుప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. దానిగూడెంకు పోలీసులు వెళ్ళనీయకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. ఈ ఘటనలో కీలక వ్యక్తులను అరెస్టు చేసి అందరిపై రౌడీషీట్లు ఓపెన్ చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు చర్యలు తీసుకోని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. దళితులపై దాడులు అరికట్టడంలో ప్రభుత్వం విఫలమవుతోందని రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కన్వీనర్ ఉప్పులేటి దేవీ వరప్రసాద్ విమర్శించారు. ఇటీవల తెనాలి, తణుకు, ఇప్పుడు కైకలూరులో దళితులపై దాడులు జరిగాయన్నారు. రోడ్డుపై ఆందోళనలు చేశారంటూ దళితులపై పోలీసులు నమోదు చేసిన కేసులను ఉపసంహరించాలన్నారు. ప్రధాన నిందితుడు కొల్లి బాబీని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నాగ జగన్ బాబూరావు, కృష్ణాజిల్లా మాలమహానాడు అధ్యక్షుడు దోవా గోవర్ధన్, దళిత నాయకులు పాల్గొన్నారు. సున్నితమైన అంశంపై కావాలని ఘర్షణలకు పాల్పడితే సహించమని డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ హెచ్చరించారు. 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. దళితులపై దాడి కేసులో ఇప్పటికే అరెస్టులు చేసి రిమాండ్‌కు పంపామన్నారు. మరొకరిపై ఆరోపణలను నిర్ధారణ చేసుకుని చర్యలు తీసుకుంటామన్నారు.

సీసలిలో ఉద్రిక్తత


సీసలిలో పోలీసుల్ని మోహరించిన దృశ్యం

కాళ్ల: కాళ్ల మండలం సీసలిలో రెండు వర్గాల మధ్య తలెత్తిన వివాదం ఘర్షణకు దారితీసింది. గ్రామ దేవత గుడి పక్కన ఉన్న పోరంబోకు స్థలం విషయంలో వివాదం తలెత్తగా.. ఇరువర్గాల దాడిలో పలువురు గాయపడ్డారు. దీంతో పెద్ద సంఖ్యలో పోలీసులు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. సీసలి హరిజన పేటకు చేర్చి కాలువ ఒడ్డున తాడిచెట్టు ఉండగా, అక్కడ కొన్ని సంవత్సరాలుగా పోలేరమ్మకు పూజలు చేస్తున్నారు. జూన్‌లో అదే ప్రాంతంలో పోలేరమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. గుడికి పక్కనే కొంత స్థలం ఉంది. ఈ స్థలాన్ని స్థానిక దళితులు అంబేడ్కర్ జయంతి రోజున భోజనాలు వండేందుకు వాడుకునేవారు. ఈ స్థలంలోనే పోలేరమ్మ గుడికి సంబంధించిన ఉత్సవాలు జరిగినప్పుడు భోజనాలు పెట్టుకునేందుకు షెడ్డు కట్టాలనే ఆలోచనను స్థానిక దళితులు వ్యతిరేకిస్తున్నారు. ఈ క్రమంలో అక్కడ అంబేడ్కర్ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఈ విషయంలో ఇరువురి పెద్దలు మాట్లాడుకునే ప్రయత్నం చేశారు. కొందరు సోమవారం సాయంత్రం అక్కడికి వెళ్లి స్థలాన్ని శుభ్రం చేసే ప్రయత్నం చేశారు. ఫెన్సింగ్ తొలగించే క్రమంలో అంబేడ్కర్ ఫ్లెక్సీ పాడయింది. విషయం తెలిసి దళితులు పెద్ద ఎత్తున చేరుకుని ఆందోళన చేశారు. ఈ క్రమంలో ఇరు వర్గాలు రాళ్లు విసురుకోవడంతో పలువురికి గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

తాడేపల్లిగూడెం (టీటీసీ): ఏపీలో కూటమి ప్రభుత్వం వచ్చి 15 నెలలు కావస్తున్నా, ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చలేదని వైఎస్ఆర్‌సీపీ జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి నౌషాద్ మోహిద్దీన్ అన్నారు. పట్టణంలో సోమవారం ఆయన మాట్లాడుతూ మసీదు ఇమామ్‌లకు, మౌజనులకు ఇవ్వాల్సిన భృతి 11 నెలలుగా పెండింగ్‌లో పెట్టినట్లు వాపోయారు. మైనార్టీలకు వడ్డీ లేని రూ.5 లక్షల వరకు రుణాలు ఇస్తామని చెప్పారని, బడ్జెట్‌లో పెట్టకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు.

పశువుల్లో ప్రమాదకరంగా గాలికుంటు

- నిర్లక్ష్యం చేస్తే నష్టం తప్పదంటున్న పశుసంవర్ధక శాఖ
- ఈనెల 15 నుంచి వ్యాధి నివారణ ఉచిత టీకాలు


గాలికుంటు కారణంగా పశువు కాలిలో పుండు


పశువు నోట్లో పుండ్లు పడిన దృశ్యం

భీమవరం: వ్యవసాయమే జీవనాధారమైన పశ్చిమగోదావరి జిల్లాలో వరిసాగు తరువాత రైతులు ఎక్కువగా పశువుల పెంపకంపై ఆధారపడతారు. వేణ్ణీళ్లకు చన్నీళ్ల సాయం అనే నానుడితో వ్యవసాయంతో పాటు పాడిపశువులను పెంచుతున్నారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులను బట్టి పశువులకు గాలికుంటు వ్యాధి (ఫుట్ అండ్ మౌత్ డీసీజెస్) సోకే అవకాశముంది. ఈ వ్యాధి కారణంగా పాల దిగుబడి తగ్గిపోవడం, పనిసామర్థ్యం తగ్గిపోయే ప్రమాదముంది. వ్యాధి సోకిన పశువుల పాలు తాగిన లేగ దూడలు చనిపోయే అవకాశం ఉంది. గాలికుంటు వ్యాధి తీవ్రమైన అంటు వ్యాధి. ఇది పశువులకు, పందులకు, మేకలకు, గొర్రెలు వంటి జంతువులకు సోకుతుంది. ఈ వ్యాధికి కారణం పిక్కోర్నావిరిడే అనే వైరస్.

అధిక జ్వరం, నోట్లో పుండ్లు లక్షణాలు

గాలికుంటు వ్యాధి సోకిన పశువులకు అధిక జ్వరం వస్తుంది. పశువుల నోటి లోపల, నాలుకపై, చిగుళ్ళ, పెదవులపైన నీటి పొక్కులు ఏర్పడతాయి. ఇవి పగిలి పుండ్లుగా మారతాయి. దీని కారణంగా పశువులు మేత తినడానికి ఇబ్బంది పడతాయి. పశువుల పాదాల మధ్య, గాలికుంటుపైన, కాళ్ళ పైన నీటి పొక్కులు ఏర్పడి అవి పగిలి పుండ్లుగా మారి పశువులు నడవడానికి ఇబ్బంది పడతాయి. దీనివల్ల పశువులు కుంటుతూ నడుస్తాయి. అందుకే ఈ వ్యాధిని గాలికుంటు వ్యాధి అంటారు. నోట్లో పుండ్ల కారణంగా పశువులు నోటి నుంచి ఎక్కువగా లాలాజలాన్ని స్రవిస్తాయి.


పాడి - పంట

పాలు ఉత్పత్తిపై ప్రభావం

పశువులు మేత సరిగా తినకపోవడం వల్ల వాటి బరువు తగ్గిపోతుంది. దూడలలో ఈ వ్యాధి గుండె కండరాలను ప్రభావితం చేస్తుంది. అందువల్ల గుండె పోటు వచ్చి మరణాలు సంభవించే అవకాశం ఉంది.

గాలికుంటు ఎలా వ్యాపిస్తుంది

వ్యాధి సోకిన పశువుల నుంచి ఆరోగ్యంగా ఉన్న పశువులకు నేరుగా వ్యాధి వ్యాపిస్తుంది. కలుషితమైన మేత, నీరు, పరికరాల ద్వారా వ్యాపిస్తుంది. అంతేకాకుండా గాలి ద్వారా కూడా ఈ వైరస్ కొంత దూరం వరకు వ్యాపిస్తుంది.

వ్యాధి చికిత్స, నివారణ

- ఈ వ్యాధి నివారణకు నిర్దిష్టమైన చికిత్స లేదు. సాధారణంగా వ్యాధి లక్షణాల ఆధారంగా చికిత్స చేయాలి.
- పుండ్లలో ఇన్ఫెక్షన్ రాకుండా ఉండటానికి యాంటీబయోటిక్స్ ఉపయోగించవచ్చు. నోట్లోని పుండ్లను శుభ్రం చేయడానికి పొటాషియం పర్మాంగనేట్ వంటి ద్రావణాలను ఉపయోగించాలి. పాదాల పుండ్లకు అయోడిన్ లేదా ఇతర యాంటిసెప్టిక్ ద్రావణాలను ఉపయోగించవచ్చు. వ్యాధి నివారించడానికి టీకాలు వేయించడం చాలా ముఖ్యం. పశువులకు ప్రతి ఆరు నెలలకొకసారి టీకాలు వేయించాలి. పాడి పశువులు ఉండే స్థలాన్ని శుభ్రంగా ఉంచాలి. పశువులను ఒకదానికొకటి దూరంగా ఉంచాలి.

15 నుంచి ఉచిత టీకాలు



పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు ఈనెల 15 నుంచి జిల్లా వ్యాప్తంగా ఉచితంగా టీకాలు వేస్తున్నారు. సుమారు 45 రోజులపాటు పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో టీకాలు వేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే అనేక నష్టాలు ఏర్పడనున్నందున ఉచిత టీకాలను పాడి రైతులంతా సద్వినియోగం చేసుకోవాలి.

పి.సుధీర్‌బాబు, ఏడీ, పశుసంవర్ధకశాఖ, భీమవరం

డ్రెయిన్‌లోకి దూకి మహిళ ఆత్మహత్యాయత్నం

భీమవరం: భీమవరం పట్టణంలోని యనమదుర్రు డ్రెయిన్‌లోకి దూకి మహిళ ఆత్మహత్యకు ప్రయత్నించడం పట్టణంలో కలకలం రేపింది. సోమవారం ప్రభుత్వాసుపత్రికి సమీపంలో యనమదుర్రు డ్రెయిన్‌పై కాలిబాట వంతెన సమీపంలో మహిళ కాలువలోకి దూకిందంటూ ప్రచారం జరగడంతో పరిసర ప్రాంతాల్లోని ప్రజలు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకున్నారు. పట్టణంలోని 26వ వార్డుకు చెందిన మహిళ కుటుంబ కలహాల నేపథ్యంలో దూకినట్లు చెబుతున్నారు.

ఆరుగొలను చెరువులో గుర్తుతెలియని మృతదేహం

తాడేపల్లిగూడెం రూరల్: చెరువులో పడి అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందినట్లు రూరల్ హెడ్ కానిస్టేబుల్ జిలాని తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. ఆరుగొలను పంచాయతీ చెరువులో మృతదేహం ఉన్నట్లు వీఆర్వో ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుడికి 25 నుంచి 30 ఏళ్ళ వయస్సు ఉంటుందని, మృతుని ఆచూకి తెలిసిన వారు 9440796612కు తెలియజేయాలన్నారు.

మద్యం షాపులో గొడవ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఆరుగొలను మద్యం షాపులో ఆదివారం రాత్రి గొడవ జరిగింది. మద్యం క్వార్టర్ బాటిల్‌పై రూ.10, బీరు బాటిల్‌పై రూ.10 అదనంగా తీసుకోవడంతో వివాదం మొదలైంది. అదనంగా ఎందుకు వసూలు చేస్తున్నారని ప్రశ్నించడంతో మాటామాటా పెరిగింది. 100 మందికి పైగా మందుబాబులు షాపు మూసే వరకు కూర్చోవడంతో షాపును సిబ్బంది మూసివేశారు. ఈ వివాదాన్ని కొంత మంది పెద్దలు రాజీ చేసినట్లు తెలిసింది.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఇరగవరం: మండలంలోని అయినపర్రు పొలాల్లో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఇరగవరం హెడ్ కానిస్టేబుల్ ఐ.కృష్ణారావు తెలిపారు. నీలం రంగు జీన్స్, ఆరెంజ్ రంగు టీ షర్టు ధరించాడని, 30 నుంచి 40 ఏళ్ల వయస్సు ఉంటుందని.. ఎత్తు 5 అడుగుల 8 అంగుళాలు ఉంటుందని చెప్పారు. వీఆర్వో సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పంచనామా నిమిత్తం తణుకు ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 9440796681, 9440796639 నెంబర్లకు తెలియజేయాలని కోరారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం మృతుడి జేబులో నాలుగు సెల్‌ఫోన్లు ఉన్నాయని అతను ఫోన్లు దొంగిలించడానికి వచ్చిన దొంగగా భావిస్తున్నారు.

క్షీరారామంలో పోటెత్తిన భక్తజనం


క్షీరారామంలో భక్తులు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో చంద్రగ్రహణం విడుపుకాలం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. కొందరు భక్తులు దానాలు సమర్పించుకున్నారు. క్యూలైన్లు నిండిపోయాయి. సాయంత్రం ప్రదోషకాలంలో భక్తులు సప్త సోమవారం ప్రదక్షిణల్లో పాల్గొన్నారు. అనంతరం పంచహారతుల కార్యక్రమం నిర్వహించారు.

క్లుప్తంగా

చెడు వ్యసనాలతో భవిష్యత్తు నాశనం



యువతకు అవగాహన కల్పిస్తున్న గంగాధర్

తాడేపల్లిగూడెం (టీఓసీ): చెడు వ్యసనాలు భవిష్యత్తును నాశనం చేస్తాయని దేవీ ఎడ్యూకేషనల్ సొసైటీ సైకాలజిస్ట్ టి.గంగాధర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. సొసైటీ ఆధ్వర్యంలో అవుట్ రీచ్ అండ్ డ్రాప్ ఇన్ సెంటర్ (ఓడీఐసీ) ఆధ్వర్యంలో సోమవారం స్థానిక శ్రీ ప్రగతి మోడ్రన్ డిగ్రీ కళాశాలలో మత్తు పదార్థాల వినియోగంపై అవగాహన సదస్సు జరిగింది. గంగాధర్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని తెలిపారు. విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు కృషి చేస్తే, వ్యసనాలు దరి చేరవని తెలిపారు. జీవన నైపుణ్యాలను అలవర్చుకోవాలని, జీవితాన్ని చక్కదిద్దుకోవాలని విజ్ఞప్తి చేశారు.టి.నవీన్, పీర్ ఎడ్యూకేటర్ పార్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌జీ అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

పెంటపాడు: మండలంలోని డీఆర్ గోయెంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులుగా విధులు నిర్వహించేందుకు వీలుగా ఖాళీగా ఉన్న పోస్టులకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో కోరారు. ఫిజికల్ డైరెక్టర్, కంప్యూటర్ సైన్స్, రసాయన శాస్త్రం(పీజీ), సబ్జెక్టులలో అతిథి అధ్యాపక ఖాళీలు ఉన్నాయన్నారు. ఈ నెల 12న స్థానిక కళాశాలలో నిర్వహించబోయే ఇంటర్వ్యూలకు ఆయా సబ్జెక్టులలో పీజీలో 55 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. పీహెచ్‌డీ, ఎంఫిల్ చదివిన వారికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. 12లోగా స్థానిక కళాశాలలో బయోడేటాను అందించాల్సిందిగా ప్రిన్సిపాల్ కోరారు.

150 మందికి కంటి వైద్య పరీక్షలు



ప్రత్తిపాడులో కంటి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న త్రిపుల్ ఎఫ్ యాజమాన్యం

పెంటపాడు: సామాజిక సేవాకార్యక్రమాలలో భాగంగా ప్రత్తిపాడు త్రిపుల్ ఎఫ్ కార్మాగారం, స్వాభిమాన్ ట్రస్టుల ఆధ్వర్యంలో సోమవారం సుమారు 150 మందికి ఉచితంగా కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా త్రిపుల్‌ఎఫ్ కర్మాగార అధినేత ఓం ప్రకాష్ గోయంకా, సీమా గోయంకా తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సురేంద్ర, డాక్టర్ రవికుమార్, త్రిపుల్ కర్మాగారప్రతినిధులు జనార్ధన్, శ్రీనివాసరెడ్డి, వేమల శ్రీనివాస్, సత్యనారాయణ, ఇతర విభాగాల సిబ్బందితో పాటు, సాభిమాన్ ట్రస్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



రేలంగి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేస్తున్న నాగబాబు

అత్తిలి: వసీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా భీమవరం అసిస్టెంట్ మలేరియా అధికారి వై.నాగబాబు చెప్పారు. సోమవారం అత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెగ్యులర్ ఫీవర్ సర్వే తప్పనిసరిగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ఆర్. సురేఖ, ఇన్‌చార్జ్ ఎస్‌యూ ఓ.కే. సత్యనారాయణ,హెల్త్ ఎడ్యుకేటర్ జి.ప్రమీల, పర్యవేక్షకులు ఏ. వెంకటరాజు,హెల్త్ అసిస్టెంట్స్ జె.యస్.గనిరాజు, టి.నాగకృష్ణ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ఇరగవరం: మండలంలోని రేలంగి పీహెచ్‌సీలో సోమవారం జిల్లా మలేరియా అధికారి యాతం నాగబాబు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం పీహెచ్‌సీ పరిధిలో ఫ్రైడే, డ్రైడే నిర్వహించాలన్నారు. ఇంటి పరిసరాల చుట్టు నిల్వ ఉన్న ప్రదేశాల్లో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని తెలిపారు. విధుల్లో ఆలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైద్య సిబ్బంది ఎంపీహెచ్‌వో జీకెఆర్‌సీవీ ప్రసాద్, డి నాగమణి, ఎం సత్యనారాయణ పాల్గొన్నారు.

బార్ల దరఖాస్తుకు 14 వరకు గడువు

తణుకు అర్బన్: తణుకు పట్టణంలో మొదటి విడతలో మిగిలిన మూడు బార్లకు జారీ చేసిన నోటిఫికేషన్ సంబంధించి దరఖాస్తుల స్వీకరణకు ఈనెల 14వ తేదీ వరకు మాత్రమే గడువు ఉందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ సత్తి మణికంఠరెడ్డి తెలిపారు. ఈ అవకాశాన్ని ఔత్సాహిక దరఖాస్తుదారులు సద్వినియోగపరచుకోవాలన్నారు.

చెత్తతో చిత్తవుతున్న పైడిపర్రు

- కంపోస్టును తలపిస్తున్న రోడ్డు మార్జిన్‌లు
- పారిశుద్ధ్య నిర్వహణ గాలికొదిలేసిన దుస్థితి
- కొరవడిన పారిశుద్ధ్య అధికారులు పర్యవేక్షణ
- రూరల్ పోలీస్ స్టేషన్ సాక్షిగా రోడ్డుపై చెత్త



పైడిపర్రులో కాలువగట్టు ప్రాంతంలో డంపింగ్ యార్డును తలపిస్తున్న చెత్త

తణుకు అర్బన్: తణుకు మునిసిపాలిటీ పరిధిలో ఉన్న పైడిపర్రు ప్రాంతం చెత్త సమస్యతో అతలాకుతలమవుతోంది. పారిశుద్ధ్య నిర్వహణపై తగిన శ్రద్ధ చూపకపోవడంతో పైడిపర్రు ప్రాంతం ఇటీవల కాలంలో రహదారుల్లో చెత్త పేరుకుపోతుందని వాపోతున్నారు. పారిశుద్ధ్య విభాగ అధికారుల పర్యవేక్షణ లోపం, నిర్వహణ అంతంతమాత్రంగా ఉండడంతో చెత్తతో చిత్తవ్వాల్సిన దుస్థితి నెలకొందని స్థానికులు, ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా పైడిపర్రు నుంచి మండపాక వెళ్లే రోడ్డు పొడవునా కంపోస్టు యార్డు మాదిరిగా చెత్త గుట్టలు పేరుకుపోతున్నాయని వాపోతున్నారు. నిత్యం పైడిపర్రువాసులతో పాటు మండపాక, బల్లిపాడు, అత్తిలి తదితర గ్రామాలకు వేలసంఖ్యలో ప్రయాణాలు చేసే ప్రయాణికులు ఈ మార్గంలో ముక్కుమూసుకుని ప్రయాణాలు చేయాల్సివస్తుందని చెబుతున్నారు. పారిశుద్ధ్య నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ లోపంతో ఇటీవల కాలంలో రోడ్లపై చెత్త పేరుకుపోగా, డ్రైనేజీల్లో మురుగునీటి ప్రవా హం కూడా వెళ్లని స్థితితో దుర్గంధపూరితంగా ఉంటుందని వాపోతున్నారు. కొన్ని డ్రైనేజీలు పిచ్చిమొక్కలతో మూసుకుపోయి అసలు పారిశుద్ధ్య నిర్వహణ జరుగుతుందా అనే రీతిలో ఉన్నాయని పైడిపర్రువాసులు వాపోతున్నారు. ఇంటి చెత్త నేరు గా కంపోస్టు యార్డుకు తరలించే పరిస్థితులు పూర్తి స్థాయిలో లేకపోవడంతో రహదారులపైనా, రోడ్డు మార్జిన్‌లలోను పారవేయాల్సి వస్తున్న పరిస్థితి పైడిపర్రులో నెలకొందని తెలుస్తోంది. గుడి, బడి, పోలీస్‌స్టేషన్ ఇలా ఏదీ కాదన్నట్లుగా పైడిపర్రు ప్రాంతం చెత్తతో చిత్తయిపోతోంది.

కలుషితమవుతున్న కాలువ

కాలువ గట్టు కూడా కనిపించని ఎత్తుగా చెత్త పేరుకోవడంతోపాటు చెత్త, వ్యర్థాలన్నీ కాలువలోకి జారిపోతుండడంతో కాలువ నీరు కూడ కలుషితమైపోతున్నాయని రైతాంగం ఆరోపిస్తున్నారు. మండపాక రోడ్డు పొడవునా రోడ్డు మూసుకుపోయేలా పిచ్చి మొక్కలు పెరిగిపోయి ప్రయాణాలకు ఆటంకంగా మారగా, ఎలాగో శుభ్రం చేయడంలేదు కదా అని చెత్తను సైతం అక్కడే పారవేసే పరిస్థితి నెలకొనడంతో ఆ ప్రాంతమంతా మురికికూపంగా మారిపోతుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



పైడిపర్రు స్వర్ణ దుర్గ ఆలయ సమీపంలో రోడ్డు పక్కన పేరుకున్న చెత్త



పైడిపర్రు పోలీస్ స్టేషన్ ముందు రోడ్డుపైనే తిష్టవేసిన చెత్త

ఎరువుల కొరత నివారించాలి



తణుకులో ఎరువుల కొరతపై తహసీల్దార్ అశోక్‌వర్మకు వినతిపత్రం అందజేస్తున్న భీమారావు

తణుకు అర్బన్: ఎరువుల కొరత నివారించి రైతులకు అవసరమైన ఎరువులు సరఫరా చేయాలని, బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు ఎరువుల కొరతను నిర సిస్తూ సోమవారం సీపీఐ తణుకు పట్టణ సమితి ఆధ్వర్యంలో తణుకు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి డిమాండ్స్ తో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దారు డి.అశోక్ వర్మకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఎకరాకు 200 కిలోలు ఎరువులు వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, రైతు భరోసా కేంద్రాల ద్వారా సరఫరా చేయాలనికోరారు. ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న వారిపై విజిలెన్స్, పోలీస్ అధికారులు దాడులు చేసి దోషులపై చర్యలు తీసుకోవాలన్నారు. సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు మాట్లాడుతూ యూరియాపై బ్లాక్‌లో రూ. 100, డిఎపిపై రూ. 200 అదనంగా వసూలు చేయడాన్ని అరికట్టాలన్నారు. ప్రతి జిల్లా కు ఎన్ని క్వింటాళ్లు ఎరువులు సరఫరా చేసింది శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. సీపీఐ తణుకు ఏరియా కార్యదర్శి సికిలే పుష్పకుమారి, పట్టణ సమితి సభ్యులు పెండ్యాల దత్తాత్రేయ ప్రసాద్, అమ్మిరాజు, బొద్దాని మురళి, కృష్ణకిషోర్, పెన్మెత్స సత్యనారాయణ రాజు, కొంబత్తుల రవికుమార్, సారిపల్లి శ్రీరామ్, నూనె రాధాకృష్ణ పాల్గొన్నారు.

మృతదేహాన్ని ఇండియాకు రప్పించండి



గట్టిం మాణిక్యాలరావుకు వినతిపత్రం అందజేస్తున్న మృతుని బంధువులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఈజిప్ట్ దేశానికి వెళ్లి అక్కడ మరణించిన ఇండియా వాసి మృతదేహాన్ని జిల్లాకు రప్పించాలని సోమవారం కైండెనెస్ ఫౌండేషన్ చైర్మన్ గట్టిం మాణిక్యాలరావుకు పలువురు విన్నవించారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు శివారు కె.గంగాధరరావు ఆగస్టు 13వ తేదీన ఈజిప్ట్ దేశానికి పర్యటన కోసం వెళ్లి అక్కడ ఆకస్మికంగా గుండె నొప్పితో మరణించారు. విషయం తెలుసుకున్న గంగాధరరావు కుటుంబ సభ్యులు మృతదేహాన్ని ఇండియాకు తీసుకురావాలని తాడేపల్లిగూడెంలోని గల్ఫ్‌హెల్ప్ కేంద్రానికి వచ్చి విన్నవించారు. ఈ సందర్భంగా మాణిక్యాలరావు మాట్లాడుతూ మృతదేహాన్ని ఇండియాకు రప్పిస్తానని హామీ ఇచ్చారు. విదేశాలకు వెళ్లేవారు ఏ ప్రాంతానికి వెళ్లతున్నారు, ఏ విమానానికి వెళ్తతున్నారు, సందర్శిస్తున్న ప్రాంతం, ట్రావెల్ ఏజెంట్ వివరాలు, ఇన్సురెన్స్ వివరాలు తప్పక కుటుంబ సభ్యులకు తెలియజేయాలని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మృతిని కుటుంబీకులు శివప్రసాద్, కె.శ్రీనివాస్, సునంద తదితరులు వినతిపత్రం సమర్పించారు.

రైతులు ఎరువుల ఖర్చును తగ్గించుకోవాలి



నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ గంగాధర్‌రావు

పెంటపాడు: రైతులు ఎరువుల ఖర్చును తగ్గించుకొని అత్యధిక లాభాలు అందించే నానో యూరియాపై అవగాహన పొందాలని గూడెం వ్యవసాయశాఖ ఏడీఏ గంగాధర్‌రావు పేర్కొన్నారు. సోమవారం ఆయన మండల వ్యవసాయాధికారి చీర్ల రవికుమార్‌తో కలిసి ముదునూరు, విప్పర్రు గ్రామాలలోని సొసైటీలను పరిశీలించారు. రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ యూరియా వాడకాన్ని తగ్గించి దానికి బదులుగా నానా యూరియాపై అవగాహన పొందాలన్నారు. ఈ ఎరువు సమర్థవంతంగా పనిచేసి ఆకుశిలీంద్రియాలలో చేరి మొక్కకు నత్రజని అందజేస్తుందన్నారు. తద్వారా తక్కువ ఖర్చుతో అధికదిగుబడులు సాధించవచ్చాన్నారు. ఏవో రవికుమార్ మాట్లాడుతూ సేంద్రియ వాడకంపై రైతులు అవగాహన పొందాలన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించుకొని భూసారాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బూరాడ శ్రీను, పడాల శ్రీను, పసుపులేటి అమ్మిరాజు, చినిమిల్లి సురేష్, కందాలపాటి బాలకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

అక్షరం విలువను తెలుసుకోవాలి



శాఖా గ్రంథాలయంలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): అక్షరం విలువను తెలుసుకోవాలని పలువరు వక్తలు తెలిపారు. పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో సోమవారం గ్రంథాలయాధికారి వి.శ్రీనివాసరావు అధ్యక్షతన రీడర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం ఘనంగా జరిగింది. వక్తలు రిసోర్స్ పర్సన్స్ గరికిపాటి బాపయ్య శర్మ, ప్రత్తి వీరాస్వామి, వి.జనార్ధనరావు, పి.లక్ష్మణరావు హాజరై మాట్లాడుతూ డిజటల్ యుగంలో అక్షరాస్యతను ప్రోత్సహించడం యునెస్కో థీమ్‌గా ఉందన్నారు. డిజిటల్ యుగంలో డిజిటల్ కంటెంట్ సురక్షితమన్నారు. సముచితంగా యాక్సెస్ చేయడానికి, అర్థం చేసుకోవడానికి, మూల్యాంకనం చేయడానికి, సృష్టించడానికి, కమ్యూనికేట్ చేయడానికి, చదువులో నిమగ్నమవడానికి వీలు కల్పిస్తుందని చెప్పారు. అక్షరం నశించదని, అక్షరం విలువను తప్పక తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కోపల్లె శ్రీనివాస్‌రావుచే బామ్మ వేషధారణ, విశ్రాంత టీచర్‌గా అకట్టుకున్నారు. విద్యార్థులకు అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కోపల్లెకు సత్కారం చేశారు. జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, సీనియర్ సిటిజన్స్, వివిధ స్కూల్‌ల విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా నిల్వలు



కంచుమర్రులో రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు

అత్తిలి: జిల్లాలో ఎక్కడ యూరియా కొరత లేదని ప్రస్తుతం సొసైటీల వద్ద, ప్రైవేట్ డీలర్ల వద్ద, మార్కెట్ గోడౌన్ వద్ద యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి జెడ్ వెంకటేశ్వరరావు చెప్పారు. సోమవారం ఆయన అత్తిలి మండలం స్కిన్నరపురం, కంచుమర్రు, మంచిలి గ్రామాల్లో పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు సోమవారం యూరియా వచ్చిందన్నారు. రైతులు అవసరం మేరకే యూరియా, ఇతర ఎరువులు వినియోగించాలన్నారు. అధికంగా ఎరువులు వినియోగించినట్లయితే భూమిలో సూక్ష్మజీవులవృద్ధి తగ్గి పంట దిగుబడి తగ్గుతుందని తెలిపారు. రైతులందరూ వేసవిలో పచ్చిరొట్ట, నవధాన్యాలు చల్లి పొలంలో పచ్చిరొట్ట పెంచినట్లయితే భూమిలో సూక్ష్మజీవుల ఎదుగుదల పెరిగి వేసిన ఎరువులు సద్వినియోగం అవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి టీకే.రాజేష్, గ్రామ వ్యవసాయ సహాయకులు చంద్రిక, సాహిత్య, సూర్య కిరణ్ గ్రామ రైతులు పాల్గొన్నారు. అనంతరం మంచిలి సొసైటీలో ఎరువులు గోడౌన్‌లో యూరియా నిల్వలు తనిఖీ చేశారు. ఎరువుల డీలర్లు అందరూ కూడా అమ్మిన ఎరువులను వెంటనే ఈపాస్ నందు నమోదు చేయాలని ఆదేశించారు.

గతంలో ఏఎంసీని భ్రష్టు పట్టించిన టీడీపీ

- ఏఎంసీ కుర్చీ మొట్టమొదటగా ఎస్సీ వర్గానికి ఇచ్చింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే
- సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ జానకి విమర్శలు



తణుకులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ మాజీ చైర్మన్ జానకి

తణుకు అర్బన్: గత టీడీపీ హయాంలో తణుకు మార్కెట్ కమిటీని భ్రష్టు పట్టించారని ఏఎంసీ మాజీ చైర్మన్ ఉండవల్లి జానకి విమర్శించారు. తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తణుకు మార్కెట్ కమిటీ ఎస్సీ వర్గానికి కేటాయించిన ఘనత మా పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావుకు మాత్రమే దక్కుతుందని తెలిపారు. వారి ప్రోత్సాహంతోనే మొట్టమొదటిగా తణుకు మార్కెట్ కమిటీ ఎస్సీ వర్గానికి వచ్చిందని, ఆ కారణంగానే నేడు కూటమి ప్రభుత్వం వచ్చాక తణుకులో తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే తిరిగి మళ్లీ ఎస్సీ వర్గానికి కేటాయించబడిందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ప్రస్తుత ఏఎంసీ చైర్మన్ కొండేటి శివ పాత విషయాలు మరిచి విలేకరుల సమావేశంలో మా నాయకులపై ఇస్టానుసారంగా మాట్లాడటం సరికాదన్నారు. పదవి వచ్చింది కథా అని ఇస్టానుసారంగా మాట్లాడడం తగదని గతం ఏంటో గుర్తుతెచ్చుకోవాలని ఎద్దేవా చేశారు. ఎస్సీల్లో ఎవరైనా పుట్టాలనుకుంటారా అని మీ అధినాయకుడు అంటే మీకెందుకురా రాజకీయాలు మా కాళ్ల దగ్గర పడి ఉండండిరా అని అన్నది కూడా మీ నాయకులేనని దుయ్యబట్టారు. పదవులు శాశ్వతం కాదని, ఇవాళ మీరు ఉన్నట్లే రేపు మాకు వస్తుందనే విషయాన్ని గుర్తుంచుకుని నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. కరోనా సమయంలో మీరంతా కనుమరుగైపోయారని, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో మాజీ మంత్రి కారుమూరి ఇంటింటికి తిరిగి వారి యోగక్షేమాలు తెలుసుకుని వైద్యసేవలే కాకుండా నిత్యావసర సరుకులు కూడా అందచేసిన చరిత్ర ఉందని, మీరు ఇంటికే పరిమితమైపోగా మీ నాయకులు ఇతర రాష్ట్రాల్లో తలదాచుకున్నారని ఎద్దేవా చేశారు. పదవిలో ఉన్నప్పుడు ప్రజలకు మంచి చేసేందుకు ప్రయత్నించాలని, మీరిచ్చిన హామీలు ఆడబిడ్డ నిధి అని, నిరుద్యోగ భృతి ఏం చేశారో వెనక్కి తిరిగి చూసుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, ఏఎంసీ మాజీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, ఎస్సీసెల్ తణుకు పట్టణ అధ్యక్షుడు పెనుమాక రాజేష్, ఉండవల్లి సురేష్ పాల్గొన్నారు.

మాజీ మంత్రి కొట్టు పరామర్శలు



మీనవిల్లూరులో చింతపల్లి శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: మండలంలో పలు గ్రామాల్లో సోమవారం మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పర్యటించారు. వైఎస్సార్ సీపీ నాయకులతో సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా మీనవిల్లూరు గ్రామంలో గ్రామ సర్పంచ్ చింతపల్లి లక్ష్మి భర్త, పార్టీ బీసీ సంఘ నాయకుడు చింతపల్లి శ్రీనివాస్ ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకొని విశ్రాంతి తీసుకొంటున్నారు. ఈ సందర్భంగా కొట్టు సత్యనారాయణ ఆయనను పరామర్శించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఉమామహేశ్వరం గ్రామంలో వైఎస్సార్ సీపీ కార్యకర్త పండు ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందడంతో వారి కుటుంసభ్యులను కొట్టు సత్యనారాయణ పరామర్శించారు. గూడెం మసీదు సెంటర్‌లో ముస్లీం ప్రముఖుడు మహ్మద్ అబ్దుల్ గనీ సాహెబ్ ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంసభ్యులను కొట్టు సత్యనారాయణ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, ముప్పిడి సంపత్‌కుమార్, వీరకుమార్, బుద్దాని శ్రీనివాస్, గుండుమోగుల సాంబయ్య, శిరాపు శాంతకుమార్ చల్లా లింగమూర్తి, కొండ్రెడ్డి వెంకట్రావు పాల్గొన్నారు.

రెడ్డి సామాజికవర్గ బలోపేతానికే ఆర్‌డీఎస్ ఏర్పాటు



చిత్తూరు జిల్లా పుంగనూరు శక్తి క్షేత్రం సందర్శనలో జిల్లా ఆర్‌డీఎస్ నాయకులు

పెంటపాడు: రెడ్డి సంఘ ఐక్యతతో పాటు, ఇతర కులాల బలోపేతానికి రెడ్డి కమ్యూనిటీ డవలప్‌మెంట్ సొసైటీ(ఆర్సీడీఎస్) కృషి చేస్తుందని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు, తూర్పుగోదావరి ఇన్‌చార్జి కర్రి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రెండు జిల్లాలకు సంబంధించి ఆర్‌డీఎస్ నాయకులు చిత్తూరు జిల్లా పుంగనూరులోని ప్రముఖ శక్తి క్షేత్రమైన గంగమ్మ అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్రంలో సంఘ బలోపేతానికి సంబంధించి ప్రత్యేక పూజలు చేసినట్లు శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి సంఘ జాతీయ కన్వీనర్ వల్లపురెడ్డి వెంగళరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు యర్రపురెడ్డి సురేంద్రరెడ్డి, వర్కింగ్ అధ్యక్షుడు జైసింహారెడ్డి, మహిళా కోఆర్డినేటర్ పద్మాప్రయారెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు పోతంశెట్టి లక్ష్మి, ఉపాధ్యక్షురాలు కర్రి హైమావతి, జిల్లా ప్రధానకార్యదర్శి కర్రి సురేష్‌రెడ్డి, గూడెం రైతు విభాగం అధ్యక్షులు చిర్ల సతీష్‌రెడ్డి, కళావతి తదతరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



తణుకు ఎస్ఎన్‌వీటీ కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపల్ తులసీలక్ష్మి

తణుకు అర్బన్: సమాజంలో పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకుని మొక్కలను నాటి సంరక్షణ చేయాలని ఎస్ఎన్‌వీటీ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వి.తులసీలక్ష్మి అన్నారు. తణుకు ఎస్ఎన్‌వీటీ కళాశాలలో సోమవారం ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ మేరా యువ భారత్ జిల్లా ఆధ్వర్యంలో గణపవరం బ్లాక్ ఆధ్వర్యంలో ఏక్ పేడ్ మా కి నామ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంరద్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలు నాటడాన్ని ప్రతి విద్యార్థి బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు మేరా యువభారత్ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్యామ్‌కుమార్, శ్రీనివాస్, వై శ్రీనివాస్, జీఎంఎస్ కుమార్, మేరా యువ భారత్ సిబ్బంది జుత్తిగ అరుణ్ సాయి కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలు.. వ్యర్థాలకు నిలయాలు



పాతూరు 12వ వార్డులో తొలగించని చెత్తచెదారాలు, వ్యర్థాలు



ఖాళీ స్థలాలలో ఏపుగా పెరుకుపోయిన పిచ్చిమొక్కలు



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెత్తా చెదారాలు, ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

చెత్తను తొలగించాలని స్థానికుల వినతి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని పాతూరు 12వ వార్డులో ఎక్కడ చూసిన వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. ఒక వైపు దోమల బెడద, మరో వైపు దుర్వాసనతో ప్రజలు ఇక్కట్లు వర్ణణాతీతంగా ఉంది. సిబ్బంది కొరత కారణంగా పరిసరాలలో వ్యర్థాలను సరిగా తొలగించడం లేదని పలువురు చెబుతున్నారు. అదే విధంగా డ్రైనేజీలో పేరుకుపోతున్న వ్యర్థాలు సైతం తీయడం లేదని, వారానికి రెండో సార్లు కూడా తీయడం లేదని ప్రజలు వాపోతున్నారు. డంపింగ్ పాయింట్లు వద్ద వ్యర్థాలను అలానే ఉంచుతున్నారు. ప్రతి ఆదివారం సెలవు కావడంతో సోమవారం వరకు ఆ నిల్వలు అలానే ఉంటున్నాయి. ఏ రోజుకు ఆ రోజు తొలగించడం లేదని, దీంతో పరిసరాలు అపరిశుభ్రంగా తయారవుతున్నాయి. కుక్కల బెడదతోపాటు అవి పేరుకున్న వ్యర్థాలు తీసుకువచ్చి రోడ్లు పైన, ఇళ్లలలోను ఉంచుతున్నాయి. ఇటీవల వర్షాలు కారణంగా పిచ్చి మొక్కలు వేపుగా పెరిగాయి. స్కూల్స్ పరిసరాలలోను, ఆవరణలోను, గోడలు చుట్టూ రోడ్లు మీదుగా ఈ మొక్కలు పెరిగిపోయాయి. శానటరీ సిబ్బంది అప్పుడప్పుడూ వాటిని తొలగించినా, వ్యర్థాలను మాత్రం తొలగించడం లేదు. చిన్న చిన్న ఖాళీ స్థలాలు వద్ద సైతం చిట్టడువులు తలపింప చేస్తున్నాయి. పాముల బెడద కూడా ఉండటం ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తక్షణమే శానిటరీ అధికారులు స్పందించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.